లబ్ధిదారులకు నివేశన స్థలం పట్టాలు పంపిణీ

నివేశన స్థలం పట్టాలను అందజేస్తున్న మంత్రి జూపల్లి

కోడేరు, నవంబర్ 1 : మండలంలోని ఎత్తంలో 201 మంది లబ్ధిదారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం నివేశన స్థలం సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదప్రజల సంక్షేమానికి నిరంతరం పాటుపడుతున్నదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేవిధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, వేణుగోపాల్‌యాదవ్, మాజీ ఎంపీపీ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

పటేల్ ఆశయాలు ఆచరణీయం

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

వల్లభాయ్ పటేల్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ, పోలీస్ సిబ్బంది

నాగర్‌కర్నూల్, నవంబర్ 1 : సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలు సర్వకాలాలలో ఆచరణీయమని, వ్యక్తిగత ఆరోగ్యం, వయస్సు సహకరించకపోయినా జీవితాన్ని ఫణంగా పెట్టి సమైక్య భారతదేశాన్ని సృష్టించే బృహత్తర లక్ష్యాన్ని చేపట్టిన మహనీయులు సర్ధార్ వల్లభాయ్ పటేల్ అని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో సర్ధార్ వల్లభాయ్ పటేల్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రవీందర్, ఎస్సై రమేశ్, ఆర్ఎస్సై గౌస్ పాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా పటాకుల అమ్మకాలు

పటాకుల దుకాణం వద్ద ప్రజల సందడి

అచ్చంపేటటౌన్, నవంబర్ 1 : దీపావళి పండుగ సందర్భంగా అచ్చంపేట పట్టణంలో పటాకుల అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని ఉట్లకోనేరు పక్కన గల కన్నయ్య రైస్‌మిల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పటాకుల దుకాణాల సముదాయం వద్ద పట్టణ ప్రజలు కొనుగోలు చేయడానికి పెద్దెత్తున రావడంతో పటాకుల వ్యాపారస్తులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈసారి గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది పెద్ద ఎత్తున పటాకులు అమ్మకాలు జరిగాయని వ్యాపారులు పేర్కొన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన భక్తులు
- పటాకుల శబ్దాలతో మార్మోగిన గ్రామాలు
- దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, అధికారులు

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంతోపాటు కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాలోని ఆయా గ్రామాల ప్రజలు గురు, శుక్రవారాలు దీపావళి పండుగను ఘనంగా జరపుకొన్నారు. విద్యుద్దీపాలు కాంతులు, పటాకులు శబ్దాలతో ఆయా గ్రామాలు హోరెత్తాయి. వ్యాపారులు తమ వ్యాపార, వాణిజ్య సంస్థలను పూలు, విద్యుదుద్దీపాలతో అందంగా ముస్తాబు చేసి భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవికి పూజలు నిర్వహించారు. ఇండ్లల్లో మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి వివిధ రకాల పిండి వంటకాలతో నైవేద్యాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ఇళ్ల ముందు దివ్వెలు వెలిగించారు. అనంతరం చిన్నాపెద్ద తేడా లేకుండా పటాకులు కాల్చారు. గత యేడాది కంటే క్రాకర్స్ ధరలు ఈ సంవత్సరం అధికంగా పెరిగాయని ప్రజలు పేర్కొన్నారు.

నాగర్‌కర్నూల్ : పటాకులు కాలుస్తున్న కుటుంబ సభ్యులు

కోడేరులో పటాకులు కాల్చుతున్న ప్రజలు

లింగాలలో దీపావళి వేడుకలు జరుపుకొంటున్న కుటుంబ సభ్యులు

నాగర్‌కర్నూల్, నవంబర్ 1 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈసారి దీపావళి అమావాస్య స్వాతి నక్షత్రంలో రావడంతో నోములు, వ్రతాలు ప్రజలు పెద్ద ఎత్తున జరుపుకొన్నారు. కొత్తగా పెళ్లయిన జంటలకు, కొత్తగా నోములు పట్టుకునే వారికి ఈ శుభగడియలు కావడంతో ప్రతి ఇంట్లో దీపావళి కళ వెల్లివిరిసింది. పండుగపూట నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రాత్రి వేళల్లో పటాకుల చప్పుళ్లతో మార్మోగింది. ఈ సందర్భంగా మహిళలు కొత్త దుస్తులు ధరించి ఇంటి ముందు దీపాలను అలంకరించారు. పటాకులు కాలుస్తూ సందడి చేశారు.

అమ్రాబాద్‌లో..

అమ్రాబాద్, నవంబర్ 1 : అమ్రాబాద్, పదర ఉమ్మడి మండలాల్లో దీపావళి పండుగను ప్రజలు గురువారం ఘనంగా జరుపుకొన్నారు. ఉదయాన్ని లేచి స్నానాలు అచరించి కొత్త బట్టలు ధరించి లక్ష్మీపూజ, కేదారేశ్వరి నోములు, వ్రతాలు నిర్వహించి పిండి వంటలతో దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. అమావాస్య ఘడియలలో ఇండ్లను దీపాలతో అలంకరించి పటాకులను కల్చి సంబురాలు చేసుకున్నారు.

లింగాలలో..

లింగాల, నవంబర్ 1 : మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం దీపావళి పర్వదిన వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. యువతి, యువకులు కుటుంబ సభ్యులతో కలిసి పటాకులు కాల్చి సంబురాలు చేశారు. అదేవిధంగా కొందరు తమ ఇండ్లలో నోము లు, వ్రతాలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై నాగరాజు ఆయుధ పూజ చేశారు.

ఉప్పునుంతలలో..

ఉప్పునుంతల, నవంబర్ 1 : ఉప్పునుంతల మండలంలో దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు, పెద్దలు అంతా పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. గురువారం పండుగ సందర్భంగా గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.

వెల్దండలో..

వెల్దండ, నవంబర్ 1 : దీపావళి పర్వదినాన్ని మండల ప్రజలు గురు, శుక్రవారాల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలు, చిన్నారులు, యువకులు పటాకులు పేల్చి సంబురాలను జరుపుకొన్నారు. ప్రజలు ఉదయాన్నే ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్లల్లో తమ అనవాయితీగా వస్తున్న నోములు, వ్రతాలు చేశారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తిరూరల్, నవంబర్ 1 : కల్వకుర్తి మండలంలోని ఆయా గ్రామాల్లో దీపావళి పర్వదినాన్ని శుక్రవారం ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. సాయంత్రం వేళలో ఇళ్ల ముందు ద్వీపలు ఉంచి పూజలు చేసి పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు.

కోడేరులో..

కోడేరు, నవంబర్ 1 : మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం దీపావళి పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పిండివంటలు చేసుకొని ఆనందంగా గడిపారు. పటాకులు కాల్చారు. కొందరు నోములను పురస్కరించుకొని గౌరమ్మకు పూజలు చేశారు. కొన్ని ఇండ్లలో దీపాలంకరణ చేసి ప్రమీదలు ఏర్పాటు చేసి దీపాలను వెలిగించారు. కోడేరులో దీపావళి పండుగ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

వంగూరులో..

వంగూరు, నవంబర్ 1 : మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం దీపావళి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ప్రజలతో డబ్బులు లేని పరిస్థితి కొట్టొచ్చినట్లు కనిపించింది. రైతుభరోసా లేక పండించిన పత్తికి మద్దతు ధర లభించక గ్రామాల్లో ఈ సారి పండుగ అంతంత మాత్రంగానే కనిపించింది. కేవలం నోములు(వ్రతాలు)నిర్వహించిన వారి ఇంటి వద్ద మాత్రమే పండుగ సందడి కనిపించింది.

చారకొండ, బల్మూరు మండలాల్లో..

చారకొండ/బల్మూరు, నవంబర్ 1 : దీపావళి పండుగను పురస్కరించుకొని చారకొండ, బల్మూరు మండలాల్లోని ఆయా గ్రామాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటి ఎదుట దీపాలు వెలిగించి, నోములు తదితర కార్యక్రమాలు నిర్వహించి పటాకులు కాల్చారు. అదేవిధంగా చారకొండ మండలం సిరుసనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

అచ్చంపేట మండలంలో..

అచ్చంపేటటౌన్/అచ్చంపేటరూరల్, నవంబర్ 1 : మండలంలోని ఆయా గ్రామాల్లో గురు, శుక్రవారాల్లో దీపావళి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. చిన్న, పెద్ద తేడాలేకుండా పటకులు కాల్చి సంతోషంగా గడిపారు. కొందరు నోములు, వ్రతాలు తదితర కార్యక్రమాలను గావించారు. అదేవిధంగా మండలంలోని చేదురుబావితండా గ్రామ పంచాయతీకి చెందిన మూడవత్ రవీందర్ కట్టెకు నిప్పంటించి తండా చుట్టూ కలియతిరిగాడు. అలా చేస్తే చీడపీడ, విష పురుగులు తండా దరిచేరవని వారి విశ్వాసం.

పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి, నవంబర్ 1 : మండలంలోని పలు గ్రామాల్లో దీపావళి పండుగ సంబురాలను ప్రజలు గురువారం, శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. చిన్నారులు పటాకులు కాల్చారు. మండలంలోని పలు అమ్మవారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజ చేశారు. ఆడపడుచులు దీపాలను వెలగించి లక్ష్మీదేవి అమ్మవారికి పూజలు చేశారు.

తాడూరులో..

తాడూరు, నవంబర్ 1 : మండలంలోని వివిధ గ్రామాల్లో గురు, శుక్రవారాల్లో దీపావళి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ప్రతి ఇంట్లో బంధుమిత్రులతో పండుగ వాతావరణంలో నోములు నిర్వహించారు. చిన్నారులు, పెద్దలు పటాకులు కాల్చారు.

శ్రీశైలంలో కార్తీక మాసోత్సవాలకు సర్వం సిద్ధం

- భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు
- సాధారణ రోజుల్లోనే స్పర్శదర్శనాలు
- ఈవో చంద్రశేఖర్ రెడ్డి

శ్రీశైల మహా క్షేత్రం

శ్రీశైలం, నవంబర్ 1 : శ్రీశైల మహాక్షేత్రం లో కార్తీక మాసోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు యాత్రికులకు అవసరమైన ఏర్పా ట్లు సర్వం సిద్ధం చేసినట్లు ఈవో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ప్రధానంగా రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరికీ శివయ్య దర్శనం కలిగేలా మాసాంతం గర్భాలయ అభిషేకాలు, వారాంతపు రోజుల్లో స్పర్శదర్శనాలు పూర్తిగా నిలిపివేశారు. అదేవిధంగా మాసోత్సవాల్లో భాగంగా పౌర్ణమి, ఏకాదశి, ప్రభుత్వ సెలవులతో కలిపి 16 రోజులు రద్దీ ఉంటుందని భావిస్తూ దర్శన విధానాల్లో పలు మార్పులు చేసి అలంకార దర్శనం మాత్రమే కల్పించేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. స్వామి, అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తులు ఆలయ సిబ్బందితో సహకరించాలని ఈవో కోరారు. నేటి నుంచి డిసెంబర్ 1 వరకు జరిగే ఉత్సవాలకు క్షేత్రానికి వచ్చే భక్తులు ముందుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న టికెట్ల టైం స్లాట్స్ ప్రకారం మాత్రమే స్వామి, అమ్మవార్ల దర్శనం ఉంటుందని, రుద్రహోమం, చండీ హోమాలు రెండు విడతలు, సామూహిక అభిషేకాలు మూడు విడతలు ఉండగా స్వామిఅమ్మవార్ల కల్యాణాల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్తీక దీపాలు వెలిగించుకునేందుకు గంగాధర మండపం వద్ద, ఆలయ ఉత్తర మాడవీధిలో చేసిన ప్రత్యేక ఏర్పాట్లను భక్తులు వినియోగించుకోవాలని కోరారు.

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు

వెల్దండ, నవంబర్ 1 : అంకితభావంతో పని చేసినప్పుడే ఏ ఉద్యోగికైనా మంచి గుర్తింపు లభిస్తుందని వెల్దండ, కల్వకుర్తి సీఐలు విష్ణువర్ధన్‌రెడ్డి, నాగర్జున్ అన్నారు. వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో 6 ఏండ్లుగా ఏఎస్సై కుమారస్వామి విధులు నిర్వర్తిస్తూ గురువారం ఉద్యోగ విరమణ పొందాడు. ఈ సందర్భంగా ఎస్సై కురుమూర్తి అధ్యక్షతన మండల కేంద్రంలోని ఆకృతి గార్డెన్‌లో కుమారస్వామి ఉద్యోగ విరమణ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను అమ్రాబాద్ మాజీ జెడ్పీటీసీ అనురాధ, సీఐలు, ఎస్సైలు, నాయకులు, పోలీస్ సిబ్బంది, జర్నలిస్టులు పూలమాల, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమం లో సీఐ నర్సింహులు, ఏస్సై శ్రీనివాస్ ఉన్నారు.

మైనర్ బాలికపై 50 ఏళ్ల వ్యక్తి అసభ్యకర ప్రవర్తన

నాగర్‌కర్నూల్, నవంబర్ 1: నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని ఓ గ్రామంలో మైనర్ బాలికపై ఓ వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామానికి చెందిన 9 ఏళ్ల మైనర్ బాలికను ఇంట్లో ఎవరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన 50 ఏళ్ల బాలికను బయటకు తీసుకొచ్చి మాయమాటలు చెబుతూ అసభ్యంగా ప్రవర్తించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని సదరు బాలిక సాయంత్రం తల్లిదండ్రులకు చెప్పడంతో కుల పెద్దలతో గ్రామంలోనే పంచాయితీ పెట్టినట్లు సమాచారం. మూడు రోజుల కిందట ఈ ఘటన జరగగా సదరు ప్రాంతంలో ఎస్సై అందుబాటులో లేకపోవడంతో బాలిక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సదరు కేసు విషయమై నాగర్‌కర్నూల్ పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

కావలెను
★ ప్రముఖ ప్రసిద్ధిగాంచిన కంపెనీలో టీమ్ లీడర్స్‌గా మహబూబ్‌నగర్ మరియు చుట్టు ప్రక్కల ప్రాంతాలలో పని చేయుటకు M/F కావలెను. అర్హత 10th ఆపై, వయస్సు: 25 ఆపై. సంప్రు. సెల్: 9393055164.
MBNR NT-331513

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

మృతదేహం లభ్యం

నాగర్‌కర్నూల్, నవంబర్ 1 : జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రం చెరువులో బుధవారం ఓ వ్యక్తి గల్లంతై గురువారం శవమై తేలాడు. ఆదే రోజు మధ్యాహ్నం సమయంలో గుర్తు తెలియని వ్యక్తి చెరువులో ఈతకొడుతూ మునిగిపోతుండగా ట్యాంక్‌బండ్‌పై ఉన్న కొందరు పాదచారులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు చెరువు వద్దకు వచ్చి చూడగా అప్పటికే నీటిలో మునిగిపోయినట్లు చెప్పారు. దీంతో ఫైర్ సిబ్బంది సహాయంతో చెరువులో బుధవారం రాత్రి వరకు గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో మరుసటిరోజు శవమై తేలడంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి దవాఖాన మార్చురీకి తరలించారు. చెరువు లోపడి మృతి చెందినది ఎవరన్నది పోలీసులు గుర్తించలేకపోయారు. మృతదేహంపై నల్లటి డ్రాయర్ ఉన్నట్లు తెలిపారు. ఎవరైనా ఈవ్యక్తిని గుర్తిస్తే నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

కేసు నమోదు

వంగూరు, నవంబర్ 1 : మండలంలోని ఉమ్మాపూర్ గ్రామ శివారులో ఉన్న డిండి ఎత్తిపోతల కాల్వలలో మట్టిని డిండిచింతపల్లికి చెందిన ఓ మట్టి వ్యాపారస్తుడు జేసీబీ సహాయంతో టిప్పర్ ద్వారా మట్టిని అక్రమంగా తరలిస్తుండగా గురువారం పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై మహేందర్ శుక్రవారం తెలిపారు. కేసు నమోదు చేసి మైనింగ్ శాఖ అధికారులకు అప్పగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనుమతులు లేకుండా మట్టి ని తరలిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

ఎస్సైకి సన్మానం

తాడూరు, నవంబర్ 1 : తాడూరు మండలంలోని మేడిపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పరమేశ్వర్, సోషల్ మీడియా మండలాధ్యక్షుడు నరేశ్ శుక్రవారం తాడూరు ఎస్సై గురుస్వామిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రామస్వామి, అశోక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత

అచ్చంపేటటౌన్, నవంబర్ 1 : క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేద దివ్యాంగులకు ఆర్థిక సాయం అందజేసినట్లు ఆ సంస్థ అచ్చంపేట డివిజన్ అధ్యక్షుడు పెద్ది మురళి తెలిపారు. శుక్రవారం తన పుట్టిన రోజు సందర్భంగా వినుకొండ గ్రామానికి చెందిన దివ్యాంగులు రంగయ్య, లక్ష్మి దంపతులు కల్వకుర్తి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పాటలు పాడుతూ కనిపించగా వారితో మాట్లాడి అల్పాహారం, బ్రెడ్, కొంత ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, కోశాధికారి కొత్త రమేశ్, సభ్యులు పరమేశ్వర ప్రసాద్, గోపాల్ నాయక్, సాయిరాం పాల్గొన్నారు.

కోడేరులో..

కోడేరు, నవంబర్ 1 : మండల కేంద్రానికి చెందిన యాపచెట్టు బురాన్ అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబానికి రూ.10వేలు అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు శ్రీశైలం, స్వామి, లక్ష్మణ్, రామకృష్ణ, ఆదిసోమనాథ్, రాజు, లిటిల్ సోల్జర్స్ యూత్ సభ్యులు ఉన్నారు.

చారకొండలో..

చారకొండ, నవంబర్ 1: మండలంలోని చంద్రాయన్‌పల్లికి చెందిన ఓర్సు వెంకటయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ రాష్ట్ర నేత ఆశాదీప్‌రెడ్డి రూ.10వేలు, కాంగ్రెస్ గ్రామ కార్యకర్తలు కలిసి రూ.21,500 బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఆర్థికసాయం అందజేసిన వారిలో మాజీ సర్పంచ్ సాంబయ్యగౌడ్, నారాయణ, పర్వతాలు, వీరయ్య, శంకర్, వెంకటయ్య, శ్రీను, సహదేవ్, నర్సింహ, బాలయ్య, నరేశ్ పాల్గొన్నారు.

గర్భిణీకి తెల్ల రక్తకణాలు దానం

- ఫౌండేషన్ సభ్యులను అభినందించిన బాధితురాలి కుటుంబం

నాగర్‌కర్నూల్, నవంబర్ 1 : నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానకు ప్రసవం కోసం వచ్చిన గర్భిణీకి యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం తెల్ల రక్తకణాలను దానం చేశారు. పెంట్లవెల్లి మండలం మంచాలకట్ట గ్రామానికి చెందిన వెన్నెల నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు ప్రసవం కోసం వచ్చింది. ఆమెకు తెల్ల రక్తకణాలు తక్కువగా ఉండడంతో ఆపరేషన్ చేయడం ఇబ్బంది కావడంతో వెంటనే ఆమెకు అవసరమైన ప్లేట్లెట్స్ కావాలని డాక్టర్లు నిర్ధారించడంతో కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ జిల్లా యువశక్తి ఫౌండేషన్‌ని ఆశ్రయించారు. పెంట్లవెల్లికి చెందిన ఫౌండేషన్ సభ్యుడు శివ స్పందించి గర్భిణీకి తెల్ల రక్తకణాలు దానం చేశాడు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు ఎంతో మంది గర్భిణులు, తలసేమియా, డెంగ్యూ, డయాలసిస్ చేయించుకునే వారికి స్వచ్ఛందంగా ఫౌండేషన్ ద్వారా రక్తదానం చేశామని గుర్తు చేశారు. సకాలంలో తెల్ల రక్త కణాలను అందజేయడం పట్ల బాధితురాలి కుటుంబ సభ్యులు ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కోడేరు మండలాధ్యక్షుడు శివ, నాగర్‌కర్నూల్ జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, రాధాకృష్ణ, శ్రీధర్, కుమార్, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వే చేయాలి

- నాగర్‌కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నరేశ్‌బాబు

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

నాగర్‌కర్నూల్‌టౌన్, నవంబర్ 1 : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వే చేయాలని మున్సిపల్ కమిషనర్ నరేశ్‌బాబు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సర్వే ద్వారా సేకరించిన సమాచారాన్ని ప్రభుత్వానికి సరైన వివరాలను రోజు వారీగా అందజేయాలని సూచించారు. నవంబర్ 1, 2వ తేదీల్లో ఇంటింటికి స్టిక్కర్లు అతికించే కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. కుటుంబ సభ్యులు వెల్లడించిన వివరాలను మాత్రమే నమోదు చేయాలని తెలిపారు. సమావేశంలో మేనేజర్ అబ్దుల్‌సలాం, సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

కల్వకుర్తి, నవంబర్ 1 : గృహజ్యోతి పథకానికి అర్హత ఉన్న ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని టీజీసీపీడీసీఎల్ కల్వకుర్తి మండల ఏఈ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం పట్టణంలోని 21వ వార్డులో కౌన్సిలర్ సైదులుగౌడ్‌తో కలిసి విద్యుత్ వినియోగదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో తమకు గృహజ్యోతి పథకం అమలుకావడం లేదని పలువురు విద్యుత్ వినియోగదారులు ఏఈ దృష్టికి తీసుకొచ్చారు. తెల్లరేషన్‌కార్డు ఉన్నవారు గృహజ్యోతి పథకానికి గతంలో దరఖాస్తు చేసుకున్న అప్లికేషన్ నెంబర్‌తో మరోమారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

కల్వకుర్తిరూరల్, నవంబర్ 1 : క్రీడాకారులు నిత్యం క్రీడలను సాధన చేస్తూ జాతీయ స్థాయిలో రాణించి తమ ప్రతిభను చాటాలని ఎస్‌జీఎఫ్ పాలమూరు జిల్లా కార్యదర్శి పాపిరెడ్డి, మార్చాల గ్రామ రైతు సమన్వయ సమితి మాజీ కన్వీనర్ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం కల్వకుర్తి మండలం మార్చాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో కబడ్డీ రాష్ట్ర అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో అండర్-19 ఖోఖో క్రీడాకారుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడాకారుల ఎంపికను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరమణ, నాయకులు జలాల్, నిజామొద్దీన్ ఉన్నారు.

యువకుడి మృతి

పెద్దకొత్తపల్లి, నవంబర్ 1 : మండలంలోని పెద్దకార్పాముల గ్రామానికి చెందిన ప్రణయ్ దీప్ (19) అతని స్నేహితుడు శ్రీశైలం వీరయ్యలతో కలిసి గురువారం పనుల నిమిత్తం నాయినోనిపల్లి నుంచి చిన్నకొత్తపల్లికి వెళ్తుండగా చిన్నకార్పాముల గ్రామ శివారులో మోటర్ సైకిల్ అదుపు తప్పి కింద పడిపోయారు. గాయపడిన వారిని గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం ప్రణయ్ దీప్ మృతి చెందాడు. గాయపడిన వీరేశ్‌కు దవాఖానలో చికిత్స పొందుతున్నారు. మృతుడి తండ్రి ఎల్లస్వామి ఫిర్యాదు మేరకు ఎస్సై సతీశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మొక్కజొన్న కుప్పదగ్ధం

అచ్చంపేట, నవంబర్ 1 : మొక్కజొన్న కుప్ప దగ్ధమై దాదాపు రూ.లక్ష ఆస్తినష్టం వాటిల్లిన ఘటన శుక్రవారం చోటు చేసుకున్న ది. వివరాలకు వెళ్తితే మండల కేంద్రానికి చెందిన గోడవర్ల తిరుపతయ్య గ్రామానికి శివారులో 8ఎకరాలు వ్యవసాయ పొలాన్ని కౌలుకు తీసుకొని మొక్కజొన్న పంటను సాగు చేశారు. మొక్కజొన్న పంటను కోసి ఒక వద్ద కుప్ప వేయగా ప్రమాదవశాత్తు కుప్పకు నిప్పు అంటుకుంటున్నట్లు చుట్టు పక్కల రైతులు సమాచారం ఇచ్చినట్లు బాధిత రైతు తెలిపారు. ఘటన స్థలాన్ని చేరుకొని మంటలను ఆర్పగ అప్పటికే సగం కుప్ప కాలిపోయినట్లు తెలిపారు.చేతికి వచ్చిన మొక్కజొన్న కుప్ప కాలిపోవడంతో బాధిత రైతును ఆదుకోవాలని కోరారు.

నవోదయ ప్రవేశానికి గడువు పొడిగింపు

బిజినేపల్లి, నవంబర్ 1: మండలంలోని వట్టెం గ్రామంలోగల జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో 9, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకోసం ప్రవేశపరీక్ష రాసేందుకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గెస్ట్ లెక్చరర్ల కార్యవర్గం ఎన్నిక

బిజినేపల్లి, నవంబర్ 1: మండలంలోని పాలెం గ్రామంలో గల వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అతిథి అధ్యాపకుల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మనోజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్, గౌరవ సలహాదారులుగా రవికుమార్, కోశాధికారి ప్రవల్లిక, మహేశ్వర్, మీడియా ఇన్‌చార్జిగా యాదగిరి, కార్యవర్గ సభ్యులుగా రమ్య, ప్రకాశ్‌బాబులను ఎన్నుకున్నారు.

రైతు భరోసా విడుదల చేయాలి

కొల్లాపూర్, నవంబర్ 1 : పండుగ పూట రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం వెంటనే రుణమాఫీ చేయడంతోపాటు, రైతు భరోసా విడుదల చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దూరెడ్డి రఘువర్దన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతు భరోసా కోసం రైతులు ఎదురుచూస్తున్నారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల అలసత్వం వహిస్తోందని పేర్కొన్నారు. దీపావళి పండుగ రోజు కూడా రైతులు చీకట్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మెస్ చార్జీలు పెంపుపై సంబురాలు

కల్వకుర్తి, నవంబర్ 1 : రాష్ట్ర ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచడం పట్ల శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని జ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలికల కళాశాలలో విద్యార్థినీలు సంబురాలు జరుపుకొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ దమయంతితో కలిసి విద్యార్థినులు కేట్‌కట్ చేశారు.

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

దోమలపెంట, నవంబర్ 1 : అమ్రాబాద్ మండలంలోని శ్రీశైలం ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రంలో శుక్రవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. జలవిద్యుత్ కేంద్రం డివిజనల్ ఇంజినీర్ సేఫ్టీ కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ రాము సుబ్బారెడ్డి సమగ్రతా ప్రతిజ్ఞను చదివి అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఈ లు ఆదినారాయణ, రవీంద్రకుమార్ పాల్గొన్నారు.